నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4 PM




బంగారం ధర ₹63,220 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 76,700
సెన్సెక్స్ 72,169 ↑83
నిఫ్టి 21,911 ↑57
చికెన్ ధర 1KG ₹ 220
గుడ్ల ధరలు డజన్ ₹68

# రాంచీకి బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి జార్ఖండ్ రాజధాని రాంచీకి బయలుదేరారు. రాంచీలో రాహుల్ చేపట్టనున్న భారత్ న్యాయ్ యాత్రలో నేడు పాల్గొననున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి రాంచీకి బయలు దేరారు. జార్ఖండ్‌లో చంపయ్ సోరెన్ నేతృత్వంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం అసెంబ్లీలో ఈ రోజు బల పరీక్షకు సిద్ధమైన వేళ.. రాష్ట్ర రాజధాని రాంచీలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కొన సాగనుంది. ఉదయం 11 గంటలకు రాంచీలోని ఇందిరాగాంధీ హ్యాండ్లూమ్ ప్రాసెస్ హౌజ్ నుంచి యాత్ర ప్రారంభం కానుంది. జార్ఖండ్ అసెంబ్లీలో చంపయీ సోరెన్ నేడు బలపరీక్షను ఎదుర్కో నున్నారు. మనీలాండరింగ్ కేసులో మాజీ సీఎం హేమంత్ అరెస్టు కాగా.. నూతన సీఎంగా చంపయీ ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఈనెల 2న జార్ఖండ్ సీఎంగా చంపయ్ సోరెన్ ప్రమాణం చేశారు. కాగా జార్ఖండ్ లో రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగ నున్నాయి. సమావేశాల తొలిరోజే చంపయ్ సోరెన్ బలపరీక్ష ఎదుర్కోనున్నారు. జార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు 41 మంది మద్దతు అవసరం ఉంటుంది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీల సంకీర్ణ కూటమికి 47 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. ప్రలోభాలకు లోనవుతారనే అను మానంతో ఇన్నిరోజులు జార్ఖండ్ సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలను హైదాబాద్‌లోనే ఉంచారు. హైద రాబాద్ శిబిరంలోని ఎమ్మెల్యేలు నిన్న సాయంత్రమే రాంచీ చేరుకున్నారు. కొందరు తిరు గుబాటు చేస్తారన్న ప్రచారాన్ని మంత్రి ఆలంగీర్ ఆలం తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యేలంతా ఐక్యంగా ఉన్నారని స్పష్టం చేసిన చేశారు.




## లిక్కర్ స్కాం కేసు
# కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మరో నేడు మరో కీలక పరిణామం జరుగనుంది. సుప్రీంకోర్టులో కవిత ఈడీ కేసు పిటిషన్‌పై విచారణ ఈనెల 16వ తేదీకి వాయిదా పడింది. అదే రోజున తుది విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఇక, ఈరోజు విచారణ సందర్భంగా ఈడీ నోటీసులకు కవిత హాజరు కావడంలేదని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చిన అడిషినల్ సొలిసిటర్ జనరల్. ఈ క్రమంలో ఈడీ నోటీసులను సవాల్ చేయడం వల్లే హాజరుకాలేదని చెప్పిన కవిత తరపు లాయర్ కపిల్ సిబల్. అనంతరం, కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అభిషేక్ బెనర్జీ, నళిని చిదంబరం, కవిత కేసులను ఉమ్మడిగా విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనెల 16వ తేదీన తుది వాద నలకు సిద్ధంగా ఉండాలని కోర్టు సూచించింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కవితను పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. దీంతో, ఈడీ విచారణపై కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో లిక్కర్ కేసులో తనకు ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి తనపై ఎలాంటి బలవంతపు చర్యలు ఈడీ తీసు కోకుండా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కవిత కోరారు.

# కల్కి 2898 ADలో మృణాల్?

[redacted] పిస్తారు. తాజాగా ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ చిన్న పాత్రలో నటించే అవకాశం ఉంది. మృణాల్ ఠాకూర్ అతిధి పాత్రపై ఊహాగానాలు పెరుగు తున్నాయి. మరి ఇందులో ఏమైనా నిజం ఉందో లేదో చూడాలి. మృణాల్ ఠాకూర్ సీతా రామంలో కనిపించింది. ఇక కల్కి తదుపరి దశ షూటింగ్ ఫిబ్రవరి 12, 2024న ప్రారంభమవుతుంది."కల్కి 2898 AD"లో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 09, 2024న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.






# రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై టీమిండియా ఘన విజయం

ఉప్పల్ టెస్టులో అనూహ్యంగా ఓటమి పాలైన టీమిండియా రెండో టెస్టులో అద్భుత విజయం సాధించింది. 106 పరుగులతో రోహిత్ సేన ప్రతీకారం తీర్చుకుంది. నాలుగో రోజు భారత బౌలర్లు చెలరేగడంతో ఇంగ్లండ్ 292 పరుగులకు ఆలౌటయ్యింది. టామ్ హర్ట్లే(36)ను బుమ్రా బౌల్డ్ చేసి భారత్‌కు విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో టీమిండియా 1-1తో సిరీస్ సమం చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 67/1తో నాలుగో రోజు ఆట మొదలెట్టిన ఇంగ్లండ్ ధాటిగా ఆడింది. నైట్ వాచ్‌మన్ రెహాన్ అహ్మద్(23) బౌండరీలతో విరు చుకుపడ్డాడు. అయితే.. అక్షర్ పటేల్ అతడికి చెక్ పెట్టి వికెట్ల వేటను అరంభించాడు. ఆ తర్వాత రంగంలోకి దిగిన అశ్విన్ ఉప్పల్ టెస్టు హీరో ఓలీ పోప్(23)ను ఔట్ చేశాడు. స్లిప్‌లో రోహిత్ శర్మ స్టన్నింగ్ క్యాచ్‌తో పోప్ పెవిలియన్‌కు చేరగా.. ఆ కాసేపటికే రివర్స్ స్వీప్‌తో రెండు బౌండరీలు బాదిన జో రూట్(16)ను యష్ బోల్తా కొట్టించాడు. దాంతో, స్టోక్స్ సేన 154 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. స్పిన్నర్లు అశ్విన్, కుల్దీప్ విజృంభించడంతో తొలి సెషన్‌లో ఇంగ్లండ్ ఆరు వికెట్లు కోల్పోయింది. లంచ్‌కు ముందు ఓవర్లో డేంజరస్ బెయిర్‌స్టో(26)ను బుమ్రా ఎల్బీగా వెనక్కి పంపాడు. అప్పటికీ ఓపెనర్ జాక్ క్రాలే(55), జానీ బెయిర్‌స్టో(26) మ్యాచ్ దాదాపు ఇంగ్లండ్ వైపే ఉంది. అయితే.. చైనామన్ కుల్దీప్ యాదవ్ సూపర్ డెలివరీతో క్రాలే ఎల్బీగా వెనుదిరిగాడు. లంచ్‌కు ముందు ఆఖరి ఓవర్లో బుమ్రా.. డేంజరస్ బెయిర్‌స్టోను ఎల్బీగా ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టాడు. లంచ్ సమయానికి 6 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. టెయిలెండర్లతో కలిసి పోరాడతాడనుకున్న కెప్టెన్ బెన్ స్టోక్స్(11) రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన టామ్ హర్ట్లే(36), బెన్ ఫోక్స్(36) కౌంటర్ అటాక్‌తో భారత బౌలర్లను కొద్దిసేపు విసి గించారు. కానీ, బుమ్రా ఈ ఇద్దరిని పెవిలియన్ పంపడంతో భారత్ విజయఢంకా మోగించింది.




శుభ్‌మన్ గిల్(104), యశస్వీ జైస్వాల్(209) తొలి ఇన్నింగ్స్‌లో యశస్వీ జైస్వాల్(209) డబుల్ సెంచరీతో చెలరేగగా టీమిండియా రన్స్ కొట్టింది. ఆ తర్వాత బుమ్రా ఆరు వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టాడు. దాంతో, పర్యాటక జట్టు కుప్పకూలింది. ఇక అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో అండర్సన్ ధాటికి 32 పరుగలుకే ఓపెనర్లను కోల్పోయిన భారత్‌ను.. శుభ్‌మన్ గిల్(104) సెంచరీతో ఆదుకున్నాడు. అక్షర్ పటేల్(45) కీలక ఇన్నింగ్స్ ఆడినప్పటికీ టామ్ హర్ట్లే నాలుగు వికెట్లు తీయడంతో 255 పరుగులకే ఆలౌటయ్యింది. మూడో టెస్టు ఫిబ్రవరి 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగనుంది.

**ఇంగ్లండ్‌పై అత్యధిక వికెట్లు.. దిగ్గజాలను అధిగమించిన అశ్విన్**

భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనత సాధించాడు. టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్‌పై అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. వైజాగ్ టెస్టులో ఓలీ పోప్‌ను ఔట్ చేసిన అశ్విన్ ఇంగ్లండ్‌పై 96 వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.తద్వారా.. గతంలో 95 వికెట్లతో స్పిన్నర్ బీఎస్ చంద్రశేఖర్ నెలకొల్పిన రికార్డును బ్రేక్ చేశాడు. ఇంగ్లండ్‌పై అత్యధిక వికెట్లు తీసిన ఐదుగురు భారత బౌలర్లు ఎవరంటే..? అశ్విన్ 96 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా.. బీఎస్ చంద్రశేఖర్ 95 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్‌పై 92 వికెట్లు తీసిన లెజెండరీ లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే మూడో స్థానానికి పరిమితమయ్యాడు. బిషన్‌సింగ్ బేడీ, ఆల్‌రౌండర్ కపిల్ దేవ్‌లు 85 వికెట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. పేసర్ ఇషాంత్ శర్మ 67 వికెట్లు పడగొట్టి ఐదో స్థానంలో నిలిచాడు.ఉప్పల్ టెస్టులో ఆరు వికెట్లు తీసిన అశ్విన్ వైజాగ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ప్రభావం చూపలేకపోయాడు. 12 ఓవర్లలో 61 రన్స్ ఇచ్చి ఒక్క వికెట్ తీయలేదు. రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు బెన్ డకెట్(28)ను ఔట్ చేసిన అశ్విన్... నాలుగో రోజు మాత్రం కీలక వికెట్లు పడగొట్టి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. ప్రమాదకరమైన ఓలీ పోప్(23), జో రూట్(16)లను ఔట్ చేసి టీమిం డియాకు బ్రేక్ ఇచ్చాడు. సొంతగడ్డపై మెరుగైన రికార్డు ఉన్ అశ్విన్ మరో వికెట్ తీస్తే 500 వికెట్ల క్లబ్‌లో చేరుతాడు.




# శుభ్‌మన్ గిల్‌కు గాయం.. మైదానంలోకి సర్ఫరాజ్

వైజాగ్ టెస్టులో విజయంపై కన్నేసిన భారత జట్టుకు పెద్ద షాక్. సెంచరీ హీరో శుభ్‌మన్ గిల్ నాలుగో రోజు మైదానంలోకి రాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గిల్ కుడిచేతి చూపుడు వేలికి గాయమైంది. అయినా సరే నొప్పిని భరిస్తూ మూడో రోజు ఖతర్నాక్ సెంచరీ కొట్టాడు. దాంతో, మేనేజ్‌మెంట్ నాలుగో రోజు అతడికి విశ్రాంతినిచ్చింది. గిల్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ ఫీల్డింగ్‌కు వచ్చాడు.స్లిప్‌లో చురుకైన ఫీల్డర్ అయిన గిల్ దూరమవ్వడం రోహిత్ సేనకు పెద్ద లోటే.వైజాగ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్(104) సెంచరీతో కదం తొక్కాడు. జట్టులో ఉండాలంటే భారీ స్కోర్ చేయకతప్పని పరిస్థితిలో కీలక ఇన్నింగ్స్‌తో మెరిశాడు. 34 కే రెండు వికెట్లు కోల్పోయిన జట్టును గిల్ సూపర్ సెంచరీతో ఆదుకున్నాడు. శతకం తర్వాత బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.



# పోలీస్‌స్టేషన్‌పై ఉగ్రదాడి.. 10 మంది పోలీసులు మృతి


పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. డేరా ఇస్మాయిల్‌ఖాన్‌లోని చోడ్వాన్ పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్‌పై ఉగ్రమూకలు దాడిచేశారు. ఈ కాల్పుల్లో 10 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఫిబ్రవరి 8న పాకిస్థాన్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మూడు రోజుల ముందు ఈ దాడి జరగడం గమనార్హం. "ఉదయం 3 గంటలకు, ఉగ్రవాదులు పోలీసు స్టేషన్‌పై దాడి చేశారు. పోలీసు భవనంలోకి ప్రవేశించి, విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు." అని పాకిస్తాన్ పోలీసు అధికారులు తెలిపారు. ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్‌లో గత కొద్ది రోజులుగా ఉగ్రదాడుల ఘటనలు జరుగుతున్న విషయం తెలిసిందే.



# శ్రీదేవి మృతిపై నకిలీ పత్రాలు.. మహిళపై సీబీఐ ఛార్జిషీట్

అలనాటి అందాల తార శ్రీదేవి మృతిపై నకిలీ పత్రాలు సృష్టించిన ఓ యూట్యూబర్‌పై ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు సీబీఐ అధికారులు తాజాగా వెల్లడించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చెందిన దీప్తి అనే మహిళ తాను సోషల్ మీడియాలో ప్రమోట్ అయ్యేందుకు శ్రీదేవి మృతి అంశాన్ని వాడుకున్నట్లు తెలిపారు. శ్రీదేవి మృతిపై అను మానాలు వ్యక్తం చేస్తూ దీప్తి.. సామాజిక మాధ్యమాల్లో అనేక చర్చలు జరిపింది. ఆ సందర్భంగా ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో వివా దాస్పద వ్యాఖ్యలు చేసింది. తన వాదనలకు బలం చేకూర్చేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేఖలతోపాటు, సుప్రీంకోర్టు, యూఏఈ ప్రభుత్వ డాక్యుమెంట్లను చూపించింది. దీంతో దీప్తిపై ముంబైకి చెందని న్యాయవాది చాందినీ షా.. సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆమె చూపిన పత్రాలన్నీ నకిలీవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులో దీప్తి లాయర్ భరత్ సురేశ్ కుమార్ పేరును కూడా చేర్చారు. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో దీప్తి చూపిన ప్రధాని, రక్షణ మంత్రి లేఖలు నకిలీవని నిర్ధారించారు. ఈ మేరకు ఆమెపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. మరోవైపు సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేయడంపై దీప్తి స్పందించారు. తన వాంగ్మూలం నమోదు చేయకుండా సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా తనపై మోపిన అభియోగాలకు సంబం ధించిన సాక్ష్యాలను కోర్టుకు అందజేస్తానని చెప్పారు.





# గిరిజనుల హక్కుల కోసం నిలబడతాం
## బిజెపిపై రాహుల్ ఆగ్రహం

గిరిజనుల హక్కుల కోసం నిలబడతామని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా జార్ఖండ్‌లో ఆయన పర్యటించారు. ధనబాద్ జిల్లాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. 'జల్- జంగిల్- జమీన్‌పై గిరిజనుల హక్కుల కోసం తమ పార్టీ నిలబడుతుందని రాహుల్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి తుండి ప్రాంతంలో ఆగిన ఆయన యాత్ర.. తిరిగి ధనబాద్‌లోని గోవింద్‌పూర్ నుంచి ప్రారంభమైంది. ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వ రంగాన్ని కట్టబెట్టకుండా రక్షించటం, దేశంలోని నిరుద్యోగ యువత, గిరిజనులకు న్యాయం కల్పించటమే ఈ యాత్ర ముఖ్యోద్ధేశం అని రాహుల్ అన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు నోట్ల రద్దు, జిఎస్‌టితో దేశంలో నిరుద్యోగాన్ని పెంచిందని రామ్‌గఢ్‌లో ఆయన ఆరో పించారు. జార్ఖండ్‌లో రాజకీయాలు వేడెక్కిన నేపథ్యంలో రాహుల్ యాత్ర రాష్ట్రంలోకి ప్రవేశించటం గమనార్హం.





# ఎట్టకేలకు ఉద్యోగులకు జీతాలు చెల్లించిన బైజూస్

గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రముఖ ఎడ్ టెక్ స్టార్టప్ బైజూస్ ఎట్టకేలకు తమ ఉద్యోగులకు జనవరి నెల జీతాలు చెల్లించింది. ఈ మేరకు బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్.. ఉద్యోగులకు లేఖ రాశారు. ఎంతగానో పోరాడి ఈ సారి ఉద్యోగులకు జీతాలు చెల్లించినట్లు పేర్కొన్నారు. 'సోమవారం వరకు వేతనాలు అందుతాయని మీకు సమాచారం ఉంది. అయితే, సోమవారం వరకూ ఎదురుచూడాల్సిన అవసరం లేదు. నేను జీతాలు చెల్లించేందుకు గత కొన్ని నెలలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. మీరు న్యాయంగా చట్టబద్ధమైన వేతనాన్ని పొందేందుకు ఈ సారి నేను మరింత ఎక్కువగా పోరాడాల్సి వచ్చింది. ప్రతి ఒక్కరూ త్యాగాలు చేశారు. ఎన్నడూ లేనివిధంగా ఊహించని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ యుద్ధంలో అందరూ అలసి పోయారు. కానీ ఎవరూ వెనకడుగు మాత్రం వేయలేదు. దీనికి కారణం మనం నిర్మించుకున్న దానిపై మనకున్న నమ్మకమే' అని రవీంద్రన్ తన లేఖలో పేర్కొన్నారు. కష్టసమయంలో కంపెనీకి మద్దతుగా ఉన్నందుకు, జీతాల కోసం ఓపికతో ఎదురుచూసినందుకు ఉద్యోగులకు ఈ సందర్భంగా రవీంద్రన్ కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీసుల అదుపులో పంజాగుట్ట మాజీ సీఐ దుర్గారావు



పరారీలో ఉన్న పంజాగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రోడ్డు ప్రమాదం కేసులో దుర్గారావు నిందితుడిగా ఉన్నారు. షకీల్ కొడుకు పారిపోయేందుకు ఆయన సహకరించాడని ఉన్నతాధికారులు తేల్చడంతో సీపీ కొత్తకోట శ్రీనివాస్ ఆయనను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అరెస్టు తప్పదన్న వార్తల నేపథ్యంలో ఆయన పరారీలో ఉన్నారు. అప్పటి గాలిస్తున్న పోలీసులకు సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లులో పట్టుబడ్డారు. విచారణ అనంతరం ఆయనను అరెస్టు చేయనున్నారు. డిసెంబర్ 24న అర్ధరాత్రి ప్రజాభవన్ వద్ద తన కారుతో బారికేడ్‌ను ఢీకొట్టిన మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్.. అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. అయితే సాహిల్ దేశం విడిచి వెళ్లేందుకు సహకరించాడని దుర్గారావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈమేరకు తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఇన్‌స్పెక్టర్ బీ దుర్గారావు హైకోర్టును ఆశ్రయించారు. తనను పోలీసులు అరెస్టు చేస్తే తన కెరీర్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.



# మతిపోగొడుతోన్న నభా నటేష్..

నన్ను దోచుకుందువటే సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది ముద్దుగుమ్మ నభా నటేష్. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది. తొలి సినిమాతోనే ప్రేక్షకులకు ఆకట్టుకున్న ఈ చిన్నది ఆతర్వాత ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సాలిడ్ హిట్ అందుకుంది. డైనమిక్ డైరెక్టర్ పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ కావడంతో నభా నటేష్ కు మంచి క్రేజ్ వచ్చింది. కానీ ఆతర్వాత చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. దాంతో ఈ బ్యూటీపై ఆఫర్స్ కరువయ్యాయి. కానీ ఆతర్వాత చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. దాంతో ఈ బ్యూటీపై ఆఫర్స్ కరువయ్యాయి.



# గ్రామీ అవార్డుల్లో సత్తా చాటిన జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్

సంగీత రంగంలో ప్రతిష్ఠాత్మకంగా అందించే 66వ 'గ్రామీ అవార్డుల' ప్రదానోత్సవం అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో ఇవాళ అట్టహాసంగా జరిగాయి. ఈ ప్రతిష్ఠాత్మక మ్యూజిక్ అవార్డ్ షోకు స్టార్ సింగర్ ట్రెవర్ నోహ్ హోస్ట్‌గా వ్యవహరించగా. పలువురు టాప్ ఆర్టిస్టులు వేదికపై లైవ్ ఫర్ఫార్మెన్స్ చేసి అదరగొట్టారు. ఇక ఈ అవార్డు వేడుకలలో ఇండియన్ మ్యూజిక్ ఆర్టిస్టులు శంకర్ మహదేవన్, జాకీర్ హుస్సేన్ సత్తా చాటారు. వీరు కంపోజ్ చేసిన 'దిస్ మూమెంట్' అనే ఆల్బమ్ కు గ్రామీలో బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ అవార్డు అందుకోగా.. ఈ పాటను 8 మంది శక్తి అనే బ్యాండ్ పేరుతో కలిసి కంపోజ్ చేశారు. ఇందులో జాకీర్ హుస్సేన్ (తబ్లా), శంకర్ మహదేవన్ (సింగర్), వి సెల్వగనేశ్(పెర్కషనిస్ట్), జాన్ మెక్ లాగ్లిన్(గిటార్) గనేశ్ రాజాగోపాలన్(వయోలిన్) కంపోజ్ చేశారు. దీంతో పాటు జాకిర్ హుస్సేన్ మరో గ్రామీ అవార్డుని కూడా అందుకున్నారు. బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పర్ఫార్మెన్స్ కేటగిరిలో 'పాస్తో' ఆల్బమ్ కి బెలా ఫ్లెక్, ఎడ్గర్ మేయర్, రాకేష్ చౌరాసియా, జాకిర్ హుస్సేన్‌లు కలిసి ఈ అవార్డు అందుకున్నారు.

మొత్తంగా ఈ ఈవెంట్‌లో ఆరుగురు భారతీయులు గ్రామీ అవార్డులు అందుకోవడం విశేషం. జాకీర్ హుస్సేన్‌కు మూడు అవార్డులు, రాకేష్ చౌరాసియాకు రెండు అవార్డులు రాగా.. శంకర్ మహదేవన్ ఒకటి అందుకున్నాడు.

**గ్రామీ 2024 విజేతలు..**

| |
|---|
| ఉత్తమ ర్యాప్ ఆల్బమ్ – మైఖేల్ (కిల్లర్ మైక్) |
| ఉత్తమ ఆఫ్రికన్ సంగీత ప్రదర్శన – టైలా (వాటర్) |
| మ్యూజిక్ వీడియో–జోనథన్ క్లైడ్ ఎమ్ కూపర్ (ఐయామ్ ఓన్లీస్లీపింగ్) |
| గ్లోబల్ మ్యూజిక్ ప్రదర్శన – జాకిర్ హుస్సేన్, బెలా ఫెక్ (పష్తో) |
| గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ – శక్తి (దిస్ మూమెంట్) |
| ఉత్తమ బ్లూగ్రాస్ ఆల్బమ్ – మొల్లీ టర్టల్ & గోల్డెన్ హైవే – సిటీ ఆఫ్ గోల్డ్ |
| ఉత్తమ కంటెంపరరీ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్ – బెలా ఫెక్, జాకిర్ హుస్సేన్, ఎడ్గార్ మెయర్, ఫీచరింగ్ రాకేష్ – ఆస్ వీ స్పీక్ |
| ఉత్తమ జాజ్ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్ – బిల్లీ చైల్డ్స్ – ద విండ్స్ ఆఫ్ చేంజ్ |
| ఉత్తమ కంట్రీ సోలో ప్రదర్శన క్రిస్ స్టేప్లేటన్ – (వైట్ హార్స్) |
| ఉత్తమ కంట్రీ సాంగ్ క్రిస్ స్టేప్లేటన్ – (వైట్ హార్స్) |
| ఉత్తమ కామెడీ ఆల్బమ్ – డేవ్ చాపెల్ – (వాట్స్ ఇన్ ఎ నేమ్)? |
| ఉత్తమ మ్యూజికల్ థియేటర్ ఆల్బమ్ – సమ్ లైక్ ఇట్ హాట్ |
| ఉత్తమ రాక్ ఆల్బమ్ – పారామోర్ – దిస్ ఇజ్ వై |
| ఉత్తమ రాక్ సాంగ్ బాయ్‌జెనియస్ – నాట్ స్ట్రాంగ్ ఎనఫ్ |
| ఉత్తమ మెటల్ ప్రదర్శన – మెటాలికా – 72 సీజన్స్ |
| ఉత్తమ రాక్ ప్రదర్శన బాయ్‌జెనియస్ – నాట్ స్ట్రాంగ్ ఎనఫ్ |

## పేటీఎం ఖాతాల్లో కేవైసీ రూల్స్ ఉల్లంఘన..

# లావాదేవీలపై ఆర్బీఐ ఆంక్షలు..!

సామాన్యుడి నుంచి కార్పొరేట్ సంస్థల వరకూ ఇప్పుడంతా అంతా 'డిజిటల్‌మయం' డిజిటల్ లావాదేవీలు.. ఆన్‌లైన్ పేమెంట్స్.. ఫిన్ టెక్ సంస్థలదే హవా.. కానీ, లాభాలార్జనే ధ్యేయంగా పని చేస్తున్న ఫిన్ టెక్ సంస్థలు ఇతర అంశాలేవీ పట్టించుకోవడంలేదు. దీనికి నిదర్శనం ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ 'పేటీఎం' అనుబంధ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) నిర్వహణ తీరు. సరైన వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టకుండానే వందల ఖాతాలు క్రియేట్ చేస్తున్నది పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్. దీని కారణంగానే వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఖాతాదారుల నుంచి డిపాజిట్ల స్వీకరణ, క్రెడిట్ ఫెసిలిటీ కల్పించకుండా పేటీఎంపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ సరైన 'నో యువర్ కస్టమర్ - కేవైసీ' నిబంధనలు అమలు చేయకుండానే తన ప్లాట్‌ఫామ్‌పై వందల కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.కోట్లలో హవాలా లావాదేవీలు జరిగి ఉంటాయన్న సందేహాలు వెల్లువెత్తున్నాయి. 1000కి పైగా యూజర్లు తమ ఖాతాలకు ఒకే పాన్ నంబర్' లింక్ చేసినట్లు పీపీబీఎల్ బయటి ఆడిటర్లు, ఆర్బీఐ నిర్వహించిన విచారణలో తేలింది. సరైన వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టకుండానే ఖాతాలు క్రియేట్ చేశారని తెలుస్తున్నది. వీటిలో కొన్ని ఖాతాల ద్వారా హవాలా లావాదేవీలు జరిగి ఉంటాయని ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సందేహాస్పద ఖాతాల వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి, కేంద్ర హోంశాఖ, ప్రధానమంత్రి కార్యాలయా (పీఎంఓ)నికి అందజేసినట్లు అధికార వర్గాల కథనం. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లు రుజువైతే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ రెవెన్యూ విభాగం కార్యదర్శి సంజయ్




మల్హోత్రా చెప్పారు. పేటీఎం, దాని అనుబంధ సంస్థల మధ్య జరిగిన ప్రధాన లావాదేవీల వివరాలను కూడా బయటపెట్టలేదన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే జరిగితే రెగ్యులేటరీ సంస్థల దర్యాప్తు పెరుగుతుందని పేటీఎం వర్గాల కథనం. ప్రత్యేకించి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, పేరెంట్ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ మధ్య లింకేజీ, సుపరిపాలన ప్రమాణాల అమలులో లోసుగులు కనిపించాయి. పేరెంట్ యాప్ పేటీఎం ద్వారా డేటా ప్రైవసీ నిబంధనను అడ్డం పెట్టుకుని లావాదేవీలు జరిపారా అన్న అనుమానాలు రావడంతో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. కానీ తమ సంస్థపై ఎటువంటి నియంత్రణ సంస్థల చర్యలు ఉండవని పేటీఎం ఫౌండర్ విజయ్ శేఖర్ శర్మ చెప్పారు.




# ఎయిర్‌ఇండియా సహా ఆ 3 సంస్థలపై సీబీఐ చార్జిషీట్!

ఎయిర్ ఇండియా మాజీ ఎండీ అరవింద్ జాదవ్‌తోపాటు ఎస్‌ఏపీ ఇండియా, ఐబీఎంలపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. 2011లో సాఫ్ట్ వేర్ కొనుగోలు చేసినప్పుడు రూ.225 కోట్ల విలువైన సాఫ్ట్ వేర్ కొనుగోలు చేయడంలో అవకతవకలు జరిగాయని గుర్తించిన సివిల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ).. ఈ అంశాన్ని సీబీఐ దర్యాప్తునకు సిఫారసు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన సీబీఐ.. ఆరేండ్ల పాటు సుదీర్ఘ విచారణ తర్వాత తాజాగా చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఐపీసీలోని 120, అవినీతి నిరోధక చట్టంలోని కొన్ని రూల్స్‌కు అనుగుణంగా చార్జ్‌షీట్ నమోదు చేసింది.సరైన టెండర్ ప్రక్రియ నిర్వహించకుండానే ఎస్‌ఏపీ ఏజీ నుంచి ఈఆర్పీ అనే సాఫ్ట్‌వేర్‌ను ఎయిర్ ఇండియా ఎంపిక చేసింది. సంబంధిత పౌర విమానయాన శాఖ అనుమతి కూడా తీసుకోకుండానే సాఫ్ట్ వేర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2009, 2010ల్లో కార్యదర్శులు, మంత్రుల బృందాలకు ఈ విషయమై ప్రెజెంటేషన్ ఇచ్చామని ఎయిర్ ఇండియా తెలిపింది. ఇదిలా ఉంటే గతంలో ఒరాకిల్ నుంచి తీసుకున్న ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ఉండగా, కొత్త సాఫ్ట్‌వేర్ ఎందుకు తీసుకున్నారన్న విషయమై క్లారిటీ లేదు. దానిని సరి చేసేందుకు ప్రయత్నించినట్లు ఆధారాలు కనిపించడం లేదని సమాచారం. ఓపెన్ టెండర్ ప్రక్రియ చేపట్టకుండానే ఎస్‌ఏపీ, ఐబీఎంలకు నామినేషన్ పద్దతిలో ఈ కాంట్రాక్టును ఎయిర్ఇండియా అప్పగించిందన్న ఆరోపణలు ఉన్నాయి.



# చిలీలో 112కి చేరిన మృతులు

మూడు రోజులుగా చిలీని అతలాకుతలం చేస్తున్న కార్చిచ్చు ఇంకా చల్లారలేదు. ఇప్పటివరకు 112 మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. వందలాది ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 1,600 మంది పూర్తిగా నిరాశ్రయులయ్యారు. 1931లో స్థాపించిన ప్రఖ్యాత బొటానికల్ గార్డెన్ కాలిబూడిదైంది. మంటల తీవ్రత అధికంగా ఉన్న వియా డెల్ మార్ పట్టణంలో పరిస్థితులు దయనీయంగా మారాయి. అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ రెండు రోజుల జాతీయ సంతాప దినాలను ప్రకటించారు. పెద్ద ఎత్తున చెలరేగుతున్న మంటలు, దట్టమైన పొగ నేపథ్యంలో చాలా మంది ఇళ్లల్లోనే చిక్కుకుపోయారు. వియా డెల్ మార్‌లో దాదాపు 200 మంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గాబ్రియెల్ బోరిక్ తెలిపారు. దగ్ధమైన ఇళ్లలో సహాయక సిబ్బంది ఇంకా గాలింపు చేపడుతున్నారని చెప్పారు. గాయాలతో ఆస్పత్రుల్లో చేరినవారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వియా డెల్ మార్ పట్టణం ఉన్న వల్పరైజో రీజియన్ గవర్నర్ రోడ్రిగో కార్చిచ్చులపై అనుమానం వ్యక్తం చేశారు. ఇది కావాలనే ఎవరో చేసిన పనిగా ఉందని తెలిపారు. ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో మంటలు చెలరేగడం అనేక అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. దీనిపై పూర్తి దర్యాప్తు జరిపి నిజాలను వెలికితీస్తామన్నారు.



# 18 ఏండ్ల తర్వాత చిరుతో జోడి కడుతున్న త్రిష

పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. తాజాగా ఈ మూవీ షూటింగ్‌లో చిరంజీవి కూడా జాయిన్ అయ్యాడు. ఇక ఈ సినిమా కోసం చిరంజీవి ఫిజికల్‌గా ఫిట్‌గా తయారయ్యారు. దీనికి సంబంధించి ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జిమ్ వీడియో వైరల్‌గా మారింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపారు. ఇక 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవితో పాటు త్రిష కూడా జాయిన్ అయినట్లు వెల్లడించారు. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వాకౌట్!

## గవర్నర్ ప్రసంగంపై ఫైర్..

ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఇవాళ వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే అసెంబ్లీ, మండలి ఉమ్మడి సెషన్ నిర్వహించారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అయితే గవర్నర్ ప్రసంగం ప్రారంభం కాగానే రచ్చ మొదలైంది. గవర్నర్ ప్రసంగంలో అంశాల్ని తప్పబడుతూ టీడీపీ సభ్యులు నిరసనకు దిగారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్ ప్రసంగంలో అంతా అబద్ధాలు చెబుతున్నారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభం అయినప్పటి నుంచి సీట్లలో నే కూర్చుని నినాదాలు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం ఇచ్చిన హామీలెక్కడ అంటూ సభలో నిలబడి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ లు సభ నుంచి వాకౌట్ చేసి బయటికి వెళ్లిపోయారు. అనంతరం గవర్నర్ ప్రసంగం కొనసాగింది. గవర్నర్ ప్రసంగం పూర్తి చేసిన తర్వాత అసెంబ్లీ రేపటికి వాయిదా పడింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఎన్ని రోజులు సభ నిర్వహించాలి, ఇందులో బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టాలి, ఇతర అంశాలపై చర్చించేందుకు బీఏసీ కాసేపట్లో సమావేశమవుతోంది. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రేపు మాత్రం గవర్నర్ ప్రసంగంపై చర్చ చేపడతారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేస్తారు.